



# టేకిట్ ఈజీ!! - 3

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## -6-

## ఉదర బలి - ద బిగినింగ్

వంటింట్లో కుంపటి పొయ్యి మీద పేద్ద గిన్నె క్లోజప్. దాని పై అంచులనించి లోపలికి ధారగా పడుతోన్న "నెయ్యి". ఇంకో క్లోజప్. గాజులు వేసుకున్న ఒక ముసలి చెయ్యి, వణుకుతోంది. స్క్రీనంతా నేతి చుక్కలు జలపాతాలలాగ జారుతున్నాయి. పక్కనే గురవయ్య మొహం క్లోజప్.

*"లాభం లేదు బుచ్చీ, నువ్వు ఇలా వణుకుతూ వణుకుతూ నెయ్యి వేస్తే నీ మైసూరు పాకం వ్రతం పూర్తవ్వదు. ధారగా, గబ గబా పొయ్యాలి. రెండో చేత్తో కలుపుతూ వుండాలి, లేకపోతే అడుగంటి పోతుంది. "*

దీనంగా తల తిప్పి చూసింది బుచ్చి.

*"అది కాదన్నయ్యా, ఈ కీళ్ళ నొప్పులు భరించలేకపోతున్నాను. పోనీ సింపుల్ గా యే చపాతీ వ్రతమో, పచ్చి పులుసు వ్రతమో చేసుకుందామా? పోనీ కందిపచ్చడి వ్రతమన్నా సరే. నువ్వు రోట్లో నూరేస్తే, నేను బొచ్చెలో పోపేసి, చక్కగా చిప్పలోకి తీసేసుకోవచ్చు.?".*

విన్న గురవయ్య తుళ్ళి పడ్డాడు. *"మరదే, నీ కొడుకు, మన బెమ్మయ్య బావుండాలంటే, నువ్వు మైసూరు పాకు వ్రతమే చెయ్యాలి. ఇంతకీ ఆ బడుద్ధాయి ఏడీ?"* అన్నాడు అనుమానంగా అటూ ఇటూ చూస్తూ.

ఇక్కడ హీరో ఎంట్రన్సు షాట్. అద్దిరిపోవాల. జిగ్గి లాడి పోవాల (అంటే ఏంటో నాకూ తెలీదు). అటక మీదనించి ఆవకాయ జాడీలు తప్పించుకుంటూ, ఒక్కసారి మావయ్య పంచె మీదకి ఎగిరి దూకాడు "బె.....మ్మ......య్య...".

*"ఇక్కడే వున్నా మావయ్యా, మొదటి మైసూరు పాకు నోట్లో వేసుకుని వెడదామని వెయిటింగు చేత్తున్నాను. నువ్వు చూస్తే ఎప్పుడూ తిండిగోలే అని తిడతావని అటకెక్కాను. ఇంతకీ రెడీ అయ్యాయా?"* అన్నాడు బెమ్మయ్య.

*"ఏవిట్రా రెడీ అయ్యేది నా పాడె, ఆవిడకి చెయ్యి వణుకు సంకటం. నెయ్యి తెచ్చి వెయ్యలేకపోతోంది. నువ్వు పందికొక్కులా అటకెక్కి కూచున్నావు. ఇంక మైసూర్ పాకం ఎలా తయారవుతుంది?"* అన్నాడు గురవయ్య చిరాగ్గా.

ఓ నిముషం ఆగి *"నువ్వేం చేస్తావో తెలియదు, అర్జెంటుగా నెయ్యి తేవాలి, ఇక్కడ వెయ్యాలి"* అన్నాడు.

విన్న బెమ్మయ్య తలూపి *"ఇప్పుడే వస్తా, వుండు మావయ్యా.."* అని పెరట్లోకి పరిగెత్తాడు.

రెండో నిముషంలో దడదడ లాడే బేక్ గ్రౌండ్ మ్యూజిక్ .................

**ఫటా ఫటాగ తవ్వడం, ధమాల్ ధమాలనెత్తడం**

**ఖణేల్ ఖణేల్ల లాగుతూ**

**బరా బరా చిరాకుగా**

**భలే పులిస్తరాకుగా....** ( బావి దండకం..)

వీడేనంట వీడేనంట బెత్తంభొట్ల బెమ్మం,
నెత్తిమీద రూపాయెట్టినా అమ్ముడుబోని కొత్తెం...

మ్యూజిక్కయ్యేదాకా అట్ట నుయ్యి వరలు తవ్వి, ఆనక నుయ్యి పెకలించి, మోసుకొచ్చి, వంటింట్లో ప్రతిష్ఠ చేసేసాడు.

*"ఓరినీ జిమ్మడా, నుయ్యి కాదురా బాబూ, నెయ్యి, నె...య్యి"* అన్నాడు గురవయ్య అరుస్తూ.

*"ఏవే బుచ్చీ, మన వాడికి చెవుడు కూడా ఉందేవిటే? ఇంకా నయం పిల్ల నిద్దావనుకున్నాను పీనుగకి.."* అన్నాడు బుచ్చి కేసి తిరిగి.

*"అది సిరి చెవుడురా అన్నాయ్, ఒక్కో సారి బానే వినిపిస్తుంది కుర్ర నాగన్నకి."* అనేసి, బెమ్మయ్య కేసి తిరిగి "నాన్నా, నెయ్యి నాన్నా, నెయ్యి" అని అరిచినంత పని చేసింది.

*"ఓస్ ఇంతేగా"* అని బెమ్మయ్య ఒక్క పరుగు పెట్టి, రెండు సెకన్లలో ఒక ఆవునీ, పక్కింటావిణ్ణీ తీసుకొచ్చాడు.

అనుమానంగా చూస్తూ అడిగాడు గురవయ్య *"ఏవిట్రా, ఆవునీ అప్పలమ్మ నీ తీసుకొచ్చావు?"*.

*"మావయ్యా, ఈ ఆవు పాలిస్తుంది, అప్పలమ్మ తోడిస్తుంది, పెరుగు తోడేసి, దానిలోంచి వెన్న తీసి కాచితే నెయ్యవుతుంది. దాంతో మైసూరు పాకం చేస్తే నా సామిరంగా...ఈ హా హా.."* అన్నాడు బెమ్మయ్య విలాసంగా తలాడిస్తూ.

*"ఏడిసినట్టుంది నీ దరిద్రగొట్టు ప్లాను. ఇంతకీ ఈ ఆవు ఫామిలీ టైపేనా?"* అన్నాడు అనుమానంగా.

*"అంటే?"* అడిగాడు అప్పటికింకా ఫామిలీ టైపు కాని పసి బెమ్మయ్య.

*"ఓరి కుర్ర నా కుంకా, దీనికి దూడ వుందా?"* అసహనంగా అరిచాడు గురవయ్య.

*"లేదండి..ఇంకా జెతే కట్టలేదండి"* అని చెప్పింది అప్పలమ్మ సిగ్గు పడుతూ. అర్థవయ్యింది బెమ్మయ్యకి. వెంటనే రోడ్డు మీదకి పరిగెత్తబోయాడు. పీకుచ్చుకుని ఆపి అడిగాడు గురవయ్య *"ఎక్కడికీ?"* అని.

*"ఎద్దుని తీసుకొద్దాం. మనకేవన్నా ఐడియాలు తక్కువా ఏవిటీ"* అన్నాడు బెమ్మయ్య తల ఒక ఏంగిల్ లో ఎగరేస్తూ.

*"ఎద్దెందుకూ, నువ్వున్నావుగా దున్నపోతులాగ, దరిద్రుడా, ఇలా నువ్వు పశువులకి ఫష్టునైట్లూ, శోభనాలు గట్రా చేస్తే నీకు మిగిలేది పేడే, మైసూరుపాకు కాదు"* అనేసి *"ముందెళ్ళి ఆవునీ, అప్పలమ్మనీ వాళ్ళింట్లో అప్పచెప్పిరా"* **అనేసి** పంపేసాడు.

ఆ వాన వెలిసాకా అడిగాడు *"బుచ్చీ, మన వెధవ ఎప్పటికైనా బాగు పడతాడంటావా? కాశీకని పోయిన బావ మళ్ళీ తిరిగొస్తాడంటావా?"* అన్నాడు దీనంగా గుమ్మకేసి చూస్తూ.

*"ఏమోరా అన్నయ్యా. మన వ్రతాలు ఫలించి మన బెమ్మయ్య బాగుపడితే నీకు గుండు గీయిస్తానని మొక్కుకున్నాన్రా."* అంది బుచ్చెమ్మ జాలిగా.

*" రంగి పెళ్ళి సుబ్బి చావుకొచ్చినట్లుంది, సర్లే, అయినా బెమ్మయ్య నీకు పెంపుడు కొడుకే కదే. పిల్లలు లేకపోవటం చేత నీకు వీడిమీద మమకారం పెరిగిపోయింది.."* అంటున్నాడు గురవయ్య.

ఆవునీ, అప్పలమ్మనీ అప్పగించి, ఎద్దు దొరకక వట్టి చేతులతో వస్తూన్న బెమ్మయ్య గుమ్మంలోనే ఆగిపోయాడు. వాడు ఏ రహస్యమైతే వినకూడదో అదే వినేసాడు. తను "పెం...పు...డు...కొ...డు...కు...(కా???))". ఇక్కడ కట్ చేస్తాం.

తరువాత సీన్ డీలక్స్ హాల్ సందులో బ్రాకెట్ కోలనీలో మొదలవుతుంది. ఇక్కడ ఐటెం సాంగన్నమాట. పెరుగు గారెలాంటి బొజ్జ ఉన్న ఒకావిడ గెంతుతూ వుంటుంది. ఆవిడకి హీరోయిన్ గా వేషాలు రాక ఐటెం సాంగ్స్ మొదలెట్టింది పాతికేళ్ళ క్రితం. ఇప్పుడు ఐటెం సాంగ్స్ కి కూడా ఎక్స్పైరీ డేట్ అయిపోయింది. అయినా సరే, మన లో బడ్జెట్ సినిమాకి ఆవిడే గతి. కాబట్టి కళ్ళు తెరుచుకుని, కనవాయన్నీ (మిగితావన్నీ) మూసుకుని చూడండి.

*"జింబా జింబా జింబా బావా, ఏంకావాలో అడిగేసేయ్, తుంబా తుంబా తుంబా బావా, తూచ్చి చెప్పీ వచ్చేసేయ్"* అని పాడి, చివర్లో *"అడిగేసేయ్, అడిగేసేయ్, అడిగేసేయ్"* అని మూడు సార్లనేసరికి చిరాకుదొబ్బి అడిగేసాడు బెమ్మయ్య

*"నేను, పె..హెం..పు..హు..డు...కొడుకునా...? మా అమ్మ ఎవరు? మా నాన్న ఎవరు? చెప్పు, నీకు ఎంత డబ్బు కావాలన్నా ఇస్తాను.."* అనేసి నాలిక్కరుచుకుని జేబులో చూసాడు, రెండ్రూపాయల పావలా వుంది. తీసి ఇచ్చేసాడు.

అప్పుడు ఆ ఆయిటెం రాణి జాలి పడి బెమ్మయ్య బొజ్జ నిమిరింది. అంతే వెంటనే నత్తి వచ్చిన దానిలా *"ను...ను...ను...ను...వ్వ్...వ్వ్..వ్వు.., నువ్వేనా? వచ్చేసావా? నువ్వు విన్నది నిజమే, నువ్వు జలపాతాల్లోంచి కొట్టుకొచ్చి, బుచ్చెమ్మ వాళ్ళకి నూతిలో దొరికావు. మీ అసలు అమ్మ నీకోసం పనసాకులు ఏరుకుని కొట్టెంక బుట్టలు కుట్టుకుంటోంది. వెళ్ళు, కాపాడుకో, నీ రాజ్యం నువ్వు చేజిక్కించుకో. వెళ్ళు...."* అనేసి కుడి చెయ్యి చూపుడు వేలు ఒకవేపుగా చూపిస్తూ పడిపోయింది.

వెంటనే ఆవిడ అసిస్టెంటొచ్చి *"నువ్వేం టెన్షను పడకు బెదరూ, కాస్త డోసెక్కువైతే మా అక్కాయ్ ఇలాగే వాలిపోద్ది."* అంటూంటే అడ్డుతగిలి సీరియస్ గా అడిగాడు బెమ్మయ్య *"ఆ వేలు చూపిస్తున్న డైరెక్షన్ లో ఏముంది?"* అని.

అసిస్టెంటు కాసేపాలోచించి చెప్పాడు *"పాత బస్టాండు వుంది. అక్కడ ఇప్పుడు రోజుకి ఒకే బస్సు వస్తుంది."* సీన్ కట్టు.

అప్రయత్నంగా బెమ్మయ్య కాళ్ళు పాత బస్టాండు కేసి కదిలాయి. అది చూసి, బొజ్జ, ఇంకా శరీరంలో మిగితా పార్ట్స్ కూడా కదిలాయి. కట్ చేస్తే పాత బస్టాండు. అక్కడికి పాత బస్సులే వస్తాయి. దాని ఎదురుగా పాత వాటర్ టేంకు. దానిలో పాత నీళ్ళే వుంటాయి. అక్కడ ఒక పాత కిళ్ళీకొట్టులో పాత కిళ్ళీ కొనుక్కుని అడిగాడు బెమ్మయ్య *"ఇక్కడకి పాత బస్సులు ఎప్పుడు వస్తాయి?"*. కిళ్ళీకొట్టువాడు నవ్వుతూ చెప్పాడు.

*"బస్సులు కాదు, బస్సు, ఒక్కటే. అది ఎప్పుడొస్తుందో దానికె తెలీదు. ఎక్కడికెడుతుందో నాకు తెలీదు. ఏదో ఇలా వస్తుంది. రాగానే ఎక్కడినించో హఠాత్తుగా జనం వచ్చి కుమ్మేస్తారు. అంతలోనే రయ్యిమని అలా వెళిపోతుంది. శనివారం, ఆదివారం రాదు. ఇవాళ శుక్కురారం. నువ్వు మిస్సయితే మళ్ళీ సోంవారం దాకా ఇంతే సంగతి"* అన్నాడు వాడు పాత డబ్బులు తీసుకుంటూ.

ఆలోచించాడు బెమ్మయ్య. తనెవరో తెలుసుకోవాలి. తన రాజ్యం ఎక్కడుందో వెళ్ళి చూడాలి. గెలుచుకోవాలి. అంతే. పిచ్చ కాంఫిడెన్స్ తో అరిచాడు *"కొట్టరా సోడా.."*. కొట్టు వాడికి మండింది.

*"ఇదిగో బెమ్మయ్యా, రా అంటే పళ్ళు రాలతాయి. సోడా కావాలంటే పావలా కాసు తియ్యి."* అనేసి విసుక్కుంటూ ఓ సోడా కొట్టిచ్చాడు. గేస్ ఎక్కువైనట్టుంది, తాగ గానే ముక్కు బద్దలైనంత పనైంది బెమ్మయ్య కి. అయినా సరే, తమాయించుకుని తాగేసాడు.

ఆరు గంటలు గడిచింది. రాత్రయిపోయింది. కళ్ళల్లో వత్తులు వేసుకుని కూచున్నాడు బెమ్మయ్య. ఆయిల్ లేకపోవడం వల్ల అవి ఎవరూ వెలిగించలేదు. ఇంతలో బస్సు శబ్దం. కట్ చేస్తే ఓ నాలుగు చెక్రాల చెత్త బండి లాంటి బస్సు వచ్చి ఆగింది. బెమ్మయ్య ఎక్కేలోపే ఓ మూడు వందలమంది మీదపడి కుమ్మేసారు. ఎలాగోలా టైర్ కన్నాల్లోంచి ఇంజనులోకి, ఇంజను కన్నంలోంచి డ్రైవర్ సీట్లోకి, అక్కడి కన్నం నించి మొదటి సీట్ లోకి పాకేసి కూర్చున్నాడు. కండెక్టరొచ్చి,

*"సార్ ఇవి పెళ్ళైన ఆడాళ్ళ సీట్లు, వెనక్కెళ్ళండి"* అన్నాడు చిరాగ్గా. సరే ఓ నాలుగు సీట్లొదిలి అక్కడ వున్న వాణ్ణి తోసేసి కూర్చున్నాడు.

*"సార్, ఇవి పెళ్ళి చేసుకోవాలనుకునే కాలేజీ కుర్రాళ్ళ సీట్లు, యెనక్కి పొండి"* అన్నాడు. మరో నాలుగు సీట్లు జంపు చేసాడు.

*"సార్ ఇవి పెళ్ళైన మగాళ్ళ సీట్లు, ఆ వెనకవి పెళ్ళి కాని ఆడపిల్లల సీట్లు, మీరెళ్ళి ఆ చివరి సీట్లో కూర్చోండి"* అని అరిచాడు.

చివరిసీటులో ఓ నలభైమంది కూర్చుని వున్నారు. ఎవరిని తొయ్యాలో తెలియక ఒకణ్ణి అడిగాడు *"గురువు గారూ, ఈ ఎరేంజిమెంటేవిటి?"* అని. ఆయన నవ్వి చెప్పాడు

*"ముందు కూచున్న కుర్రాళ్ళు, వాళ్ళ ముందున్న పెళ్ళైన ఆడాళ్ళ వ్యవహారం చూసి, చస్తే పెళ్ళి చేసుకోరు. అలాగే మనముందు కూచున్న అమ్మాయిలు, ఆ ముందున్న పెళ్ళైన మగాళ్ళ బొజ్జలు, క్లాత్ హెడ్ లు, శాల్తీలు చూసి, పెళ్ళంటే విరక్తి పుట్టి, ఆడ బేచిలర్లు గా వుండిపోతారు. మా "వనస్పతి" సామ్రాజ్యానికి ఇలాంటి సైనికులే కావాలి. వీళ్ళని అక్కడ దింపేసి, ఆనక ఈ పెళ్ళైన బేచ్ లని ఇక్కడ దింపేస్తాం. వీక్ డేస్ లో మాకు ఇదే పని. ఈ చివరి సీటంతా రెగులర్ స్టాఫు. ఇక్కడ మీ అమలాపురం లో అనెంప్లాయ్మెంట్ ఎక్కువ కదా. అందుకని ఇక్కడ మాకు ఎక్కువ సైనికులు దొరుకుతారు. "*

విన్న బెమ్మయ్య అడిగాడు *"అసలు వీళ్ళకి వనస్పతి సామ్రాజ్యం గురించి ఎలా తెలుసు? వాళ్ళెందుకు బస్సెక్కుతున్నారు?"*.

ఆయన ఓ పేద్ద నవ్వు నవ్వి *"మరి మేము రెగ్యులర్ గా యూ ట్యూబ్ లో టీజర్లొదులుతాం కదా, దానిలో మరి తరన్నా, కనిష్క లు అద్దరగొట్టేస్తారు, అది చూసి వీళ్ళంతా వస్తారు. అక్కడికెళ్ళాకా తెలుస్తుంది, లైఫంటే విగ్రహాలు లాగడం, అంట్లు తోముకోవడం, అప్పుడప్పుడూ యుద్ధాలు చెయ్యడం అని"* అని ఆగి అడిగాడు

"***ఇంతకీ నీకు వనస్పతి వీసా వుందా?"***. లేదన్నట్టు అతని పెదాలు విరిచాడు బెమ్మయ్య.

***"రేయ్ తత్తు కొడకా, లేదని చెప్పాలంటే నీ పెదాలు విరుచుకోవాలి, నావి విరవ కూడదు, ముందు బస్సు దిగు, వీసా లేని నీతో మాట్లాడి నందుకు మా "నరబలి" గాడు నాకు నాలుగు టీ.వీ సీరియళ్ళు చూపిస్తాడు గేప్ లేకుండా."*** అంటూ బెమ్మయ్యని తోసేసాడు.

బస్సు స్టార్ట్ అయింది. బెమ్మయ్య మొహం మీద నాలుగు కిలోల దుమ్ము పడింది. దులుపుకుని చూసాడు. బస్సు అక్కడే వుంది. వెంటనే పాత వాటర్ టేంకు మీదకెక్కి బస్సు పైకి దూకాడు. ఒక ఇనపకమ్మీ విరిగి చేతిలీ కొచ్చింది. రెండో దాన్ని పట్టుకుని, పైన పడుకుని స్కీయింగ్ చేస్తూ, మూర్ఛపోయాడు. బస్సు స్టార్ట్ అయిన గెంటకి కదిలింది "వనస్పతి" సామ్రాజ్యం వైపు.

( విశేషం...ఐ మీన్....సశేషం...

**Sequel in 2018** )

COMMENTS